క్లుప్తంగా

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

జంగారెడ్డిగూడెం రూరల్ : విజయవాడ వెళ్లి పింఛన్ అందజేసి సేవాధృక్పథం చాటుకుంది ఓ వలంటీర్. వివరాల్లోకి వెళ్తే ఇటీవల జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోణం మంగరావు (12 సంవత్సరాలు) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతడికి ప్రభుత్వం ప్రతీ నెలా రూ.10 వేలు పింఛన్ అందిస్తోంది. అయితే ఇటీవల జరిగిన హత్యాయత్నంలో బాలుడి తల్లిదండ్రులు శివ, చిన్ని మృతిచెందారు. దాడిలో గాయపడిన బాలుడు విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏప్రిల్‌లో బాలుడికి అందించాల్సిన పింఛన్ నిమిత్తం వలంటీర్ కాంచన దేవి తన సొంత ఖర్చులతో విజయవాడ వెళ్లి పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ కాంచన దేవిని మండల అధికారులు అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

కామవరపుకోట : స్థానికంగా నివసించే షేక్ నగీన అనే ముస్లిం గర్భిణీకి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం స్థానిక కొత్తూరు జామియా మసీద్ ముస్లిం సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. సంఘ అధ్యక్షులు లాల్ జాన్ బాషా, సభ్యులు షేక్ ఇబ్రహీం, అన్వర్, అమ్ము, నూర్, కాన్, వజీర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మండల సచివాలయాల కన్వీనర్‌గా చిన్ని



ఎమ్మెల్యే తలారికి పూలబొకేను అందిస్తున్న సచివాలయాల మండల కన్వీనర్ చిన్ని

ద్వారకాతిరుమల: మండల సచివాలయాల కన్వీనర్‌గా తిరుమలంపాలెంకు చెందిన భోగరాజు సాయికృష్ణ (చిన్ని)ను గురువారం నియమించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చిన్ని ఘనంగా సత్కరించి, పూల బొకేను అందజేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి పాల్గొన్నారు.

జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా జానకిరెడ్డి



జానకిరెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

చింతలపూడి : ఏలూరు జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా స్థానిక ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు యర్రంపల్లి గ్రామంలోని ఆమె స్వగృహంలో గురువారం రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ రమేష్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి తదితరులు జానకిరెడ్డిని అభినందించారు.

పంచాయతీగోడ కూల్చివేత

కొయ్యలగూడెం : సరిపల్లి పంచాయతీ ప్రహరీ గోడను నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేశారని ఎంపీటీసీ బండి సీతారత్నం, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ మందపాటి రామకృష్ణ ఆరోపించారు. గురువారం ఇరువురు నేతలు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి వాస్తు నెపంతో ఉన్నతాధికారులకు ఏ విధమైన సమాచారం లేకుండా అదేవిధంగా ప్రజాప్రతినిధులకు తెలపకుండా తూర్పు వైపున ప్రహరీ గోడను తొలగించారని అన్నారు. గోడను తొలగించడం వల్ల కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూరనుందని, దానివల్ల కార్యదర్శి ఏకపక్ష నిర్ణయానికి పాల్పడ్డారన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసామని ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు.

సచివాలయాల తనిఖీ

కొయ్యలగూడెం : గ్రీవెన్స్ సందర్భంగా వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది సత్వర చర్యలు చేపట్టాలని ఆర్డీవో ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామాల్లోని పలు సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాసం నాగమణితో కలిసి రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యల వల్ల లేదా కోర్టు పెండింగ్‌లో ఉన్న సమస్యలు మినహా మరి ఏ విధమైన సమస్యలు పరిష్కరించబడకుండా ఉండకూడదని ఆర్డీవో సిబ్బందితో పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

ద్వారకాతిరుమల : సమష్టిగా ద్వారకాతిరుమల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. శ్రీవారి కొండపైన చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే తలారి, చైర్మన్ సుధాకరరావు బుధవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామ అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షేమ పాలనపై ప్రచారం చేయాలి



ఎన్ఆర్ పాలెంలో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



జీలుగుమిల్లిలో పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం



చింతలపూడిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ధర్మాజీగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చింతలపూడి : జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహసారథులదేనని అన్నారు. ప్రతి కుటుంబాన్ని పలకరించి అభివృద్ధి సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించాలని కోరారు. గత చంద్రబాబు ప్రభుత్వ పాలనను జగన్ సంక్షేమ పాలనను పోల్చి అప్పటికి, ఇప్పటికి ఉన్న తేడాను గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి లబ్ధిదారునికీ పథకాలు అందుతున్న విషయం గుర్తు చేసి వారి అభిప్రాయాన్ని తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్.దుర్గారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : గృహ సారథులు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేస్తూ జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సచివాలయాల కన్వీనర్ గురజాల పార్థశారధి అన్నారు. జగనన్నే మా నమ్మకం కార్యక్రమానికి సంబంధించిన కిట్లను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని టిక్కినవారిగూడెం, పేరంపేట, పుట్లగట్లగూడెం గ్రామాల్లో వలంటీర్లు, గృహ సారధులు, కన్వీనర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజాల ధర్మావతి, మద్ది ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మళ్ళీడి బాబి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువచేయాలి

పోలవరం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఎక్కడైనా గృహసారథుల నియామకంలో ఇబ్బందులు ఉంటే సరిచేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. అవసరమైతే గృహ సారథుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వాటిని నిశితంగా వివరించాల్సిన బాధ్యత వీరందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పాడుం పుష్ప, తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 14 రోజులపాటు జరిగే జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు కోరారు. నూతిరామన్నపాలెంలో గురువారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, ఎంపీటీసీ గాలి దుర్గారావు, మండల సచివాలయ కన్వీనర్ తెల్లం సింహాచలం, పెంటపాటి శ్రీను, పూనెం కృష్ణ, యాంద్ర రవి పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో పోస్టర్ల ఆవిష్కరణ

జీలుగుమిల్లిలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ పోస్టర్‌లను జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కొర్సా పోచమ్మతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు.

లింగపాలెం : సచివాలయ గృహసారథులు, వలంటీర్లు బాధ్యతగా పనిచేసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మండల సచివాలయ ఇన్‌చార్జి అన్నపనేని శాంతరావు అన్నారు. ధర్మాజీగూడెం సొసైటీ ఆవరణలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను పార్టీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ మండల ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కె రమేష్, చలగుళ్ల రవిబాబు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకల రాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు కుప్పాల రామకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కామవరపుకోట : వెంకటాపురం, వీరిశెట్టిగూడెం సచివాలయాల్లో గృహ సారథులకు గురువారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ ఆధ్వర్యంలో ప్రచార కిట్లు అందజేశారు. స్థానిక కొత్తూరు బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల టౌన్ కన్వీనర్ నానాది సాగర్, సచివాలయాల టౌన్ కన్వీనర్ షేక్ మేరా సాహెబ్, అంకాలంపాడు సచివాలయ కన్వీనర్ కరుటూరు బాలస్వామి, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, టౌన్ కన్వీనర్ సంకుకొండ, గేలం త్రివిక్రమ సోమరాజు, ఎస్కే బాజీ, మారిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కిట్లను గృహ కన్వీనర్లకు అందచేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పిలుపునిచ్చారు.

టి.నరసాపురం : ఏపుగుంటలో పార్టీ కన్వీనర్ శ్రీనురాజు ఇంటి వద్ద గురువారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు డోర్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు.

కుక్కునూరు : జగనన్నే మా మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను గురువారం కుక్కునూరులో గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఆవుల బాలక్రిష్టారెడ్డి, మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కామవరపుకోటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



కొయ్యలగూడెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు



ఏపుగుంటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కుక్కునూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం



అలివేరులో వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రామతులసి



మేడేపల్లిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవి



రామానుజపురంలో వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రామారావు

పోలవరం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం గూటాల గ్రామంలో ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. 104 వాహనంతో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ ఎస్.ప్రసాద్, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, వైద్యాధికారులు రాజీవ్, సునంద, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మేడేపల్లిలో..

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం మేడేపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీలు కేసగాని వెంకటేశ్వరమ్మ, ఎస్.నాగశ్రీ, మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు, తొటగొమ్ము సర్పంచ్ కట్టు ఉదయ్‌కిరణ్, వైసీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వర్లు, వేలేరుపాడు, కొయిదా పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

బుట్టాయగూడెం: గ్రామాల్లో ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ సభ్యులు మొడియం రామతులసి అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకూ మారుమూల గ్రామాల్లో అర్హుల ఇంటికే పింఛన్లు వచ్చే విధంగా ఏర్పాటు చేసారని, ఇదే తరహాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్ద వైద్యసేవలు అందనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఎన్‌వీ ప్రవీణ్, సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ గోవిందరాజులు, ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలుతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఎంపీపీ గంజిమాల రామారావు అన్నారు. గురువారం రామానుజపురంలో 'ఫామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ కె.విజయకృష్ణ రామానుజపురం సర్పంచ్ అడపా నాగలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యులు సుంకర రాజేష్, ఉప సర్పంచ్ వామిశెట్టి రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి వెంకట రమణ, చిల్లర రామారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తూ పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని గురవాయిగూడెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం జెడ్పీటీసీ బాబ్జి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం గొప్ప ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు లక్షల్లో ఖర్చు అయ్యే ఆపరేషన్లను సైతం పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలని, అందుకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం పోలవరం మండల సమాఖ్య కార్యాలయ సమీపంలో డ్వాక్రా మహిళలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా రుణమాఫీ చేస్తానని చెప్పారని, ఇప్పటికి మూడు విడతలుగా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీగా ఆసరా సొమ్ము అందించినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం 943 గ్రూపులకు రూ.7.33 కోట్లు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ పాడుం పుష్ప డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు, ఏపీడీ డి.నాగేశ్వరరావు, ఏపీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీపీ శాంతి

బుట్టాయగూడెం : వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కారం శాంతి అన్నారు. ఆమె ఛాంబర్‌లో గురువారం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ తీవ్రమైన ఎండలు కాస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో నీటి సమస్య తలెత్తితే ప్రజలు అవస్థలు పడే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో ఉన్న మంచి నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతోపాటు సకాలంలో ప్రజలకు నీటి అవసరాలు తీర్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సిబ్బందితో ఎప్పటికప్పుడు చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శ్రీహరి, కార్యదర్శులు కిరణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కోలాటం బృందానికి బహుమతి



బహుమతి సాధించిన కోలాట బృందం సభ్యులు

టి.నరసాపురం : తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి అలయ కమిటీ నిర్వహించిన కోలాటా భజన పోటీలలో మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ కోలాటా భజన బృందం ప్రథమ బహుమతి సాధించింది. ఈ పోటీల్లో యాభైకి పైగా కోలాట బృందాలు పాల్గొనగా తమ బృందం ప్రథమ బహుమతి గెలుచుకుందని కోలాట బృందం గురువులు భోగి రవి, వనమ ముత్యాలరావు తెలిపారు. ఈ సందర్భంగా బృంద సభ్యులను గ్రామ ప్రజలు అభినందించారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తున్న వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. గుణ్ణంపల్లికి చెందిన వేగి విజయ వెంకటరామ జోగి సూర్యవరప్రసాద్ శ్రీరామ్‌కు, ఎంఎస్ మాధురికి 17 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే తేజస్విని అనే మహిళతో శ్రీరామ్ వివాహేతర సంబంధం పెట్టుకుని, భార్య మాధురిని విడాకులు ఇవ్వాలంటూ చిత్రహింసలు పెడుతున్నాడు. వారిద్దరు తనను చంపుతామని బెదిరిస్తున్నారని మాధురి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

సాయన్నపాలెం శివారులోని ఒక పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13,100 నగదు, 3 బైక్‌లు, 6 కుర్చీలు, ఒక టేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

జంగారెడ్డిగూడెం: ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం కలిగే నష్టాలను వివరించారు. పాల నుంచి నీళ్ల దాకా మనం ప్లాస్టిక్ మీద ఆధారపడి ఉన్నామని, దానివల్ల పిల్లలతో సహ అందరం అనారోగ్యాల బారిన పడుతున్నామన్నారు. స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. దుకాణాల్లో పాలిథిన్ కవర్లు విక్రయించరాదన్నారు. సచివాలయం కార్యదర్శి ఏసురత్నం ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వ్యాపారాలకు మార్గం చూపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిని కోరారు.